సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

• ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే



పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎయిర్‌పోర్టులో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, సాదర స్వాగతం పలికారు. - అక్కిరెడ్డిపాలెం

ఘనంగా దామా సుబ్బారావు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు జన్మదిన వేడుకలను పార్టీ వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు(మెడికల్ బాబు) ఆధ్వర్యంలో దామా ఇంటి వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. దామా అభిమానులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, చేగొండి శ్రీనివాసరావు, సోషల్‌మీడియా కన్వీనర్ శ్రీనివాస పట్నాయక్, మాటూరి శ్రీనివాసరావు, వార్డు మహిళా అధ్యక్షురాలు నిర్మల, కన్వీనర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొడ్డ గోవింద్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మంగళవారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వాడపల్లి రామచంద్రరాజు, ఎన్నేటి రమణ, ప్రగడ గోవిందరాజులు, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిపించారు. అధిక శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్, విశాఖ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతాల్లో దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి ఆధ్వర్యంలో పురాణ పండితుడు చల్లా సత్యనారాయణ సత్యనారాయణ వ్రతం ప్రాశస్త్యాన్ని వివరించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్, ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

పేద గుండెకు భరోసా

- అగనంపూడి ఆస్పత్రిలో స్టెమీ ప్రాజెక్టు
- ఛాతీనొప్పి బాధితులకు అత్యవసర సేవలు



ఆస్పత్రిలో కొత్తగా అమర్చిన గుండె సంబంధ చికిత్స పరికరాలు

అగనంపూడి: అగనంపూడి ఆస్పత్రిలో గుండె, ఛాతీ సంబంధిత వ్యాధులకు సంబంధించి అత్యవసర చికిత్స అందించే పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. పోస్ట్ కోవిడ్ కారణంగా యువతలో ఛాతీ నొప్పితో బాధపడేవారు అధికం అవుతుండడంతో ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. హృద్రోగులకు భరోసా కల్పిస్తూ స్టెమి(ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్) ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి విశాఖ జిల్లాల్లో ఎంపిక చేసిన 14 ఆస్పత్రుల్లో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. అందులో అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఒకటి కావడంతో ఇక్కడ అత్యవసర వైద్యసేవలు ప్రారంభమయ్యాయి.

ఆస్పత్రికి చేరిన పరికరాలు

ఛాతీ నొప్పి లక్షణాలతో బాధ పడేవారికి అత్యవసర సేవలు అందించేందుకు అవసరమైన వైద్య పరికరాలు, మందులు అందుబాటులోకి వచ్చాయి. ప్రాజెక్టులో భాగంగా 12 లీడ్ ఈసీజీ, గుండెనొప్పికి సంబంధించి 25 రకాల మందులు, డీఫిబ్రిలేటర్, అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ (ఏఎల్ఎస్) అంబులెన్స్ ఆస్పత్రికి చేరాయి.

తక్షణ వైద్యసేవలు

ఛాతీ నొప్పితో బాధపడేవారు ముందుగా ఆస్పత్రిలోని క్యాజువాల్టీలో ఏర్పాటు చేసిన విభాగంలో సంప్రదిస్తే స్కీనింగ్ పరీక్షలు చేసి, వ్యాధి నిర్ధారణ చేయనున్నారు. ఛాతిలో నొప్పి అని తేలిన పక్షంలో తక్షణ వైద్య సేవలు అందించనున్నారు. అవసరమైన మందులు అందించడం, ప్రథమ చికిత్స చేసి కేజీహెచ్‌లోని కార్డియాలజీ విభాగం వైద్యుల సూచనలు, సలహాల మేరకు సేవలు అందించి, అక్కడి నుంచి ఏఎల్ఎస్ అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించనున్నారు.

ఫార్మా ఉద్యోగికి అత్యవసర సేవలు

ఫార్మా కంపెనీకి చెందిన ఒక ఉద్యోగి మంగళవారం ఛాతీ నొప్పితో బాధపడుతూ అగనంపూడి ఆస్పత్రిలో జాయిన్ అవ్వడంతో వెంటనే వైద్యులు అత్యవసర సేవలు అందించారు. ఈసీజీ తరువాత హార్ట్ అటాక్ అని తేలడంతో అవసరమైన మందులు అందించి, కేజీహెచ్ హృద్రోగ నిపుణుల సలహా మేరకు ఏఎల్ఎస్ అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉష తెలిపారు. ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్, ఏపీవీవీపీ జిల్లా కో-ఆర్డినేటర్ రమేష్ కిషోర్ పర్యవేక్షణలో సేవలు అందిస్తున్నామన్నారు. వైద్యులకు కార్డియాలజీ ప్రథమ చికిత్సకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.

హృద్రోగ బాధితులకు అత్యవసర సేవలు



స్టెమీ ప్రాజెక్టులో భాగంగా రెండు రోజుల క్రితం ఆస్పత్రికి పరికరాలు, మందులు వచ్చాయి. క్యాజువాల్టీలో హృద్రోగ బాధితులకు అత్యవసర, సత్వర సేవలు అందించడమే లక్ష్యం. కోవిడ్ తరువాత ఛాతీ నొప్పితో బాధపడే యువత సంఖ్య అధికమైంది. బాధితులు పెరుగుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్టెమీ ప్రాజెక్టును అగనంపూడి ఆస్పత్రికి వర్తింపజేయడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతీయులకు మరో అధునాతన వైద్యసేవ అందుబాటులోకి వచ్చింది.

– డాక్టర్ భారతి, ఆర్ఎంవో, అగనంపూడి ఏరియా ఆస్పత్రి

86వ వార్డులో రూ.86లక్షలతో అభివృద్ధి పనులు

శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగిరెడ్డి



శంకుస్థాపన శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 86వ వార్డు పరిధిలో సుమారు రూ.86లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన మంగళవారం శ్రీకారం చుట్టారు. శాతవాహన నగర్‌లో రూ.20లక్షల జీవీఎంసీ నిధులతో రోడ్లు, రూ.10 లక్షలతో డ్రైనేజీలు, వుడా ఫేజ్-3లో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, రూ.6 లక్షలతో డ్రైనేజీలు, వుడా ఫేజ్-6లో రూ.20 లక్షలతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, బొడ్డ రమణ, రెడ్డి, మల్లికార్జునరావు, ముద్దపు మురళీమోహన్, సూర్యప్రభ, రమాకుమార్, రమేష్ అధికారులు పాల్గొన్నారు.

గాజువాకలో రూ.36లక్షలతో ..

అక్కిరెడ్డిపాలెం: గాజువాక నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గాజువాకలో రూ.36 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. లక్ష్మీకాంత్ థియేటర్ వెనుక ఉన్న శంకర్‌నగర్ రోడ్డు, జోగువానిపాలెంలో సీసీ రోడ్డు, సీసీ కాలువలు పనులకు ఆయన శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అభివృద్ధికి అధిక ప్రాధాన్యం కల్పించారన్నారు. విద్యా, వైద్యంతో పాటు మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించి వారి సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు చేస్తున్న విషప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారని, వారికి త్వరలోనే చరమగీతం పాడతారని అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, నాయకులు పల్లా పెంటారావు, అచ్చిలి నాయుడు, లక్ష్మీ, అన్నపూర్ణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.



86వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి



బచ్‌పన్ స్కూల్‌లో చిన్నపిల్లలను పరీక్షిస్తున్న కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు

అక్కిరెడ్డిపాలెం: వర్షాకాలంలో చిన్నపిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కడల్స్ హాస్పిటల్‌కు చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ నిఖిల్ తెన్నేటి సూచించారు. గాజువాకలోని బచ్‌పన్ స్కూల్‌లో షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన వెంటనే పిల్లలకు వేడి నీటి స్నానం చేయించాలని సూచించారు. చిన్నపిల్లలు వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాన్నారు. శిబిరంలో 150 మంది పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో బచ్‌పన్ స్కూల్ డైరెక్టర్ బి.ఎం.శ్రీధర్, కిమ్స్ కడల్స్ హాస్పిటల్ డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ సూర్యప్రకాష్, డాక్టర్ మధు, డాక్టర్ ప్రియాంక, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

4 నుంచి విస్కా సాంస్కృతిక విజయోత్సవాలు

ఉక్కునగరం: విశాఖ స్టీల్ కల్చరల్ అసోసియేషన్ (విస్కా) ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 7 వరకు సాంస్కృతిక విజయోత్సవాలు నిర్వహిస్తున్నామని విస్కా కార్యదర్శి ఎ. కేశవరావు, ఆంధ్రకేసరి కళాక్షేత్రం కార్యదర్శి సిహెచ్.వి. సత్యనారాయణ తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విస్కా ఆవిర్భవించి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ నెల 4న నాట్యోపాసన పురస్కార గ్రహీత లావణ్య శిష్య బృందం భరత నాట్య ప్రదర్శన, 5న డాక్టర్ మీగడ రామలింగస్వామిచే 'తెలుగు పద్య నాటకం-వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై ప్రసంగం ఉంటాయన్నారు. 6న ఆదివారం లలిత గీతాల మృదు మంజుల సంగీత విభావరి, 7న సోమవారం నంది అవార్డు గ్రహీతలు పి.బాలాజీ నాయక్ నేతృత్వంలో 'గుడి ఎనక నాసామి' సాంఘిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. కళాభిమానులు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే హక్కు కేంద్రానికి లేదు



ఉక్కు అమరవీరులకు నివాళులర్పిస్తున్న యూజ్ నాయకులు

ఉక్కునగరం: జాతీయ సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే హక్కు కేంద్ర ప్రభుత్వానికి లేదని యూనియన్ ఆఫ్ స్టీల్ ఎంప్లాయీస్ (యూజ్) నాయకులు అన్నారు. భారత మాజీ ప్రధాని దివంగత పి.వి.నరసింహారావు విశాఖ ఉక్కును జాతీయీకరణ చేసి 31 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం యూజ్ అధ్వర్యంలో స్మృత్యంజలి పార్కు వద్ద పుష్పగుచ్ఛాలను ఉంచి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ జాతీయాకరణ చేసిన తర్వాత జాతి సంపదగా ఉంటుందన్నారు. కేంద్రం ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బి.కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.పరంధామయ్య, ఎస్.అమ్మన్న, ఆర్.సత్యనారాయణ, కె.రామ్‌కుమార్, జి.జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల వితరణ



వృద్ధులకు చీరలు అందిస్తున్న అప్పారావు

అగనంపూడి: రైల్వే ఎస్‌సీసీ కమిటీ సభ్యుడు కొలిపాక అప్పారావు 85, 79 వార్డులకు చెందిన నిరుపేద మహిళలకు చీరలు అందజేశారు. పెదమడక ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 50 మంది పేదలకు వీటిని అందించారు. ఆయన మాట్లాడుతూ తన తండ్రి తాతారావు జ్ఞాపకార్థం ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బొర్రమాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్, పద్మమార్కండేయ సేవా సంఘం అధ్యక్షుడు దొడ్డి దేముడు, ఉమామహేశ్వర ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్వర్టుపై మళ్లీ వంతెన నిర్మాణం

గతంలో జీవీఎంసీ తొలగించినా వెనక్కి తగ్గని వైనం



కల్వర్టుపై నిర్మిస్తున్న వంతెన

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలో ప్రైవేట్ వ్యక్తుల అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కొద్ది నెలల క్రితం వెంకటేశ్వర కాలనీలోని లలితాదేవి ఆలయం ఎదురుగా కొందరు ప్రైవేట్ వ్యక్తులు కల్వర్టుపై వంతెన నిర్మాణం చేపట్టారు. విషయం తెలిసిన జీవీఎంసీ దీనిని తొలగించింది. తిరిగి అదే ప్రాంతంలో నిర్మాణ పనులకు సన్నద్ధమవుతున్నారు. దీనిపై కొన్ని రాజకీయ పార్టీలు ఆందోళన చేపట్టడానికి సిద్ధమవుతున్నాయని సమాచారం.

వి.వి.రామారావుకు ఏఐటీయూసీ నివాళి

ఉక్కునగరం: ఏఐటీయూసీ జాతీయ నాయకుడు వి.వి.రామారావు ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని స్టీల్ ఏఐటీయూసీ నాయకులు నివాళి అర్పించారు. మంగళవారం సాయంత్రం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామారావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి రామారావు జీవిత కాలం చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డి. ఆదినారాయణ, అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు, జె.రామకృష్ణ, మిత్రా, కె. రాజబాబు, టి.కనకరాజు, మంత్రి రవి తదితరులు పాల్గొన్నారు.

'భవిత' చిన్నారులకు బాక్సుల పంపిణీ



చిన్నారులకు బాక్సులు అందిస్తున్న జ్యోతి

పెదగంట్యాడ: భవిత కేంద్రంలోని చిన్నారులకు లాలం జ్యోతి అనే మహిళ మంగళవారం టిఫిన్ బాక్సులు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆమె తన జన్మదినం సందర్భంగా చిన్నారులకు వీటిని అందించారు. కార్యక్రమంలో భవిత కేంద్రం నిర్వాహకులు ఎం.సూర్యనారాయణ, బి.జయభారతి పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శులకు శిక్షణ నేడు

అక్కిరెడ్డిపాలెం: ఎంపీఈపీలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, సేవా నియమాలు, ప్రవర్తనా నియమాలు, రికార్డ్ కీపింగ్ తదితర అంశాలపై జీవీఎంసీలోని వార్డు సచివాలయ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నట్లు జీవీఎంసీ అధికారులు తెలిపారు. జోన్-6, 69వ వార్డులో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి పక్కనున్న ఎంపీఈపీ స్కూల్‌లో బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్న కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలియజేశారు.

వైభవంగా అప్పన్న తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పౌర్ణమి పురస్కరించుకుని మంగళవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తిరువీధి వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను పల్లకిలో అధిష్టంపజేశారు. ఆలయ బేడా మండపంలో సాయంత్రం తిరువీధి ఘనంగా నిర్వహించారు.

సింహాచలేశుని సేవలో ..



దేవస్థానంలో పారాయణం చేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడికి చెందిన శ్రీ బొర్రమాంబ పారాయణ సేవా సమితి సభ్యులు సింహాచలం దేవస్థానంలో లలిత, విష్ణు సహస్ర పారాయణ చేశారు. 50 మంది మహిళా సభ్యులు శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణ సేవలో పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న దేవన్ రెడ్డి

పెదగంట్యాడ: మండలంలోని వెంపళ్లనగర్‌లో జాగరపు శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన, దంత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ప్రారంభించారు. కార్యక్రమంలో బాటా శ్రీను, శంకరరావు, వినోద్ బాలు, గంధం సాయి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. సీఆర్ఎంపీ, టీపీపీ విభాగాధిపతుల కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు ప్రత్యేక అలవెన్సులు చెల్లించాలని, స్కిల్డ్ కార్మికులకు బోనస్, ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలని కోరారు. అనంతరం ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి రవి, నమ్మి రమణ, రామరెడ్డి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

29వ రోజుకు గంగవరం పోర్టు కార్మికుల దీక్షలు



దీక్షా శిబిరంలో కూర్చున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలు మంగళవారానికి 29వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం దిగి వచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాద అప్పారావు, కదిరి సత్యానందం, కదిరి సత్తెయ్య, ఓలేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

పౌర్ణమి వేళ భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ

ఉక్కునగరం: పౌర్ణమి సందర్భంగా స్థానిక సెక్టార్-1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. సోమవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన ప్రదక్షిణలో భక్తుల గోవింద నామస్మరణతో గిరి మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

17 నుంచి సీపీఐ బస్సు యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న పైడిరాజు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణ కోసం ఈ నెల 17 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకూ సీపీఐ ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహించనున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. స్థానిక పోతిన సన్యాసిరావు భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17న ఉదయం 9 గంటలకు కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి ప్రారంభం కానున్న యాత్రను సీపీఐ జాతీయ కార్యదర్శి, ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ ప్రారంభిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎం.ఎస్. అప్పారావు, కసిరెడ్డి సత్యనారాయణ, జె.రామకృష్ణ, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవరకు ఉద్యమం



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవరకు ఉద్యమం కొనసాగిస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 901వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహనీయుల ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
✆ 7997958388, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
✆ 9912222749, 9705347420
Office mail : sakshiadvtvsp@gmail.com